కుక్కల బెడద.. నిత్యం వ్యధ

- పట్టణంలో శునకాల స్వైర విహారం
- చిన్నారులు, పెద్దలపై దాడులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు


5వ వార్డులో వీధి కుక్కల స్వైర విహారం

కొత్తూరు: సరదాగా ఇంటి ఎదుట ఆడుకుంటున్న చిన్నారులు.. పాఠశాలల నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థులు.. పని నిమిత్తం బయటకు వచ్చే పెద్దలు పట్టణంలో తరచూ కుక్కల దాడికి గురవుతున్నారు. పట్టణంలో ఇటీవల కాలంలో వీధి కుక్కల సంఖ్య ఘణనీయంగా పెరిగింది. ఏ కాలనీలో చూసినా నిత్యం కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పదుల సంఖ్యలో గుమిగూడి ఒక్కసారిగా ప్రజలపై దాడి చేసి గాయపర్చుతున్నాయి. కాలనీల్లో పెరిగిన కుక్కల బెడదను తగ్గించాలని బాధితులు, ప్రజలు అధికారులకు మొరపెట్టుకున్నా ఎలాంటి స్పందన లేదు.

వెంబడించి.. దాడిచేసి..

మున్సిపాలిటీలోని 8, 9, 10వ వార్డుల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఇప్పటికే చిన్నారులతో పాటు పెద్దలను కుక్కలు కరిచిన దాఖలాలు ఉన్నాయి. కుక్కల నియంత్రణకు చాలా ఏళ్లుగా స్థానికంగా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వాటి సంఖ్య విపరీతంగా పెరిగింది. రాత్రి వేళల్లో ఆయా కాలనీ ప్రజలను వెంబడించి మరీ దాడి చేస్తున్నాయి. గతేడాది కొత్తూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సుమారు 112 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి.

నియంత్రణ చర్యలు పట్టని అధికారులు

గతంలో హైద్రాబాద్‌తో పాటు అయా ప్రాంతాల్లో వీధి కుక్కల దాడుల్లో పలువురు చిన్నారులు మృత్యువాతపడ్డారు. దీంతో హైకోర్టు ఆగ్రహించడంతో అధికారులు శునకాల నియంత్రణ, సంతాన నిరోధక టీకాలు వేసేందుకు చర్యలు చేపట్టారు. కాగా కొత్తూరులో మాత్రం శునకాల సంఖ్యను లెక్కించడంతోనే అధికారులు సరిపెట్టారు. అప్పట్లో మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో సుమారు 500 కుక్కలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తర్వాత వాటి నియంత్రణ చర్యలు మాత్రం ఇప్పటికీ చేపట్టలేదు. దీంతో పట్టణంలో కుక్కల సంఖ్య చాలావరకు పెరిగిపోయి ప్రజలపై దాడులు చేస్తు గాయపర్చుతున్నాయి.

కుక్కల బెడదను నివారించాలి

మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో గౌడ సంఘం కాలనీలో నివాసం ఉంటున్నాం. గత ఆరు నెలల క్రితం మా బాబు దినేశ్(07)తోటి పిల్లలతో కలిసి ఇంటి సమీపంలో ఆడుకుంటున్న తరుణంలో వీధి కుక్కలు దాడి చేసి కరిచాయి. వెంటనే కొత్తూరు పీహెచ్‌సీకి వెళ్లి చికిత్స చేయించాం. కాలనీలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– ఆనంద్, 5వ వార్డు, కొత్తూరు

తగ్గించడానికి కృషి చేస్తున్నాం



మున్సిపాలిటీ పరిధిలోని 5, 6, 9, 10వ వార్డుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నట్లు గుర్తించాం. ఇప్పటికే మున్సిపల్ పాలకవర్గంతో చర్చించి కుక్కల బెడదను తగ్గించడానికి ప్రణాళిక తయారు చేశాం. స్వచ్ఛంద సంస్థ సహకారంతో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి బెడదను తగ్గించడానికి కృషి చేస్తున్నాం.

–బాలాజీ, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

నేడు మెగా జాబ్ మేళా

చేవెళ్ల: నియోజకవర్గంలోని గ్రామీణ యువతులకు ఉపాధి కల్పించేందుకు ప్రత్యేకంగా మెగా జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన యువతులకు ప్రముఖ ఎంఎన్‌సీ ఎలక్ట్రానిక్ కంపెనీ కొంగరకలాన్, తుక్కుగూడకు చెందిన కంపెనీ వారితో ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేయిస్తున్నామని చెప్పారు. 18ఏళ్ల వయస్సు పైబడిన వారు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్, ఫెయిల్ అయినవారు అర్హులని తెలిపారు. నెలకు జీతం 15వేలు వరకు ఉంటుందని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యేవారు పదో తరగతి సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బ్యాంక్‌ఖాతా పుస్తకం జిరాక్స్‌లతో పాటు రెండు పాస్‌ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. ఇతర వివరాలను 9390907201, 6301599675, 9390607518, 7569089109 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్


మాట్లాడుతున్న నాయకులు

మొయినాబాద్: నిరుద్యోగ యువతులు మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ అన్నారు. సోమవారం మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.15వేల వరకు వేతనం, భోజనం, బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. చేవెళ్ల నియోజకవర్గ నిరుద్యోగ యువతులు ఉపయోగించుకోవాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగయ్య, డైరెక్టర్లు రమేశ్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్ ముదిరాజ్, రాజుగౌడ్, విజయరాజ్, జగన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింహ, రాజేంద్ర, మురళీ తదితరులు ఉన్నారు.

ఎంఈఎఫ్ డివిజన్ కమిటీ ఎన్నిక


నూతన కమిటీతో ఎంఈఎఫ్ నాయకులు

కందుకూరు: మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఎంఈఎఫ్) కందుకూరు డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకుడ సోమవారం ఎన్నుకున్న కమిటీని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ ప్రకటించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా యు.యశ్వంత్, అధ్యక్షుడిగా బి.యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా జె.కృష్ణ, కోశాధికారిగా జె.శ్రీను, ఉపాధ్యక్షుడిగా బి.రాందాసు, సహాయ కార్యదర్శిగా ఎం.చంద్రశేఖర్, కార్యనిర్వాహక సభ్యుడిగా జె.బాల్‌రాజులను ఎన్నుకున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మల్లేపల్లి కృష్ణమాదిగ, ఎంఎస్పీ అధ్యక్షుడు గానుగపేట జంగయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షలకు 169 విద్యార్థులకు గాను 162 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని చీఫ్ ఎగ్జామినార్ మల్లేశ్ తెలిపారు.

ప్రభుత్వ భూమిని ఇళ్లకు కేటాయించాలని వినతి

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని ఇళ్ల స్థలాలకు, క్రీడా మైదానానికి కేటాయించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు పార్థసారధికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామ శివారులోని సర్వేనంబర్ 2లో 7 గుంటల ప్రభుత్వ భూమి ఉందని, గ్రామంలోని నిరుపేదలను గుర్తించి ఇంటి నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. అదేవిధంగా గ్రామంలోని యువతను క్రీడలవైపు ప్రోత్సహించేందుకు ఆటస్థలాన్ని కేటాయించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బాల్‌రాజ్, భాస్కర్, శివకుమార్, వెంకటేశ్, నర్సింలు, రాజు, కృష్ణ, శ్రీకాంత్, యాదగిరి తదితరులు ఉన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత


నగర సంకీర్తణ చేస్తున్న రామభక్తులు

చేవెళ్ల: ప్రతీ గ్రామంలో భగవంతుడిని స్మరించుకుంటూ సంకీర్తణలు చేయటంతో ఆధ్యాత్మికత నెలకొంటుందని చేవెళ్ల లక్ష్మీవేంకటేశ్వరస్వామి భజన మండలి అధ్యక్షుడు నరోత్తంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం శుక్ల పక్ష ఏకాదశి పురస్కరించుకొని నగర సంకీర్తన చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలో రామ భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీరామ జయరామ జయజయ రామా విజయ మహా మంత్రం స్మరిస్తూ పురవీధుల్లో ఆధ్యాత్మిక వాతవారణాన్ని నెలకొల్పారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవాటు చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో రామ భక్తులు బోజిరెడ్డి, శైలజ ఆగిరెడ్డి, మల్లేశ్, శ్రీనివాస్, రమణారెడ్డి, సీహెచ్ మల్లేశ్, బి.రాంరెడ్డి, సీహెచ్ శ్రీనివాస్, వెంకటేశ్, హరికృష్ణ, అనంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సిప్లాన్ పరిశ్రమపై చర్యలు తీసుకోండి

గ్రామ కార్యదర్శికి గిరిజనుల ఫిర్యాదు


గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తున్న తండావాసులు

నందిగామ: తండాకు అతి సమీపంలో ఉండి, ప్రమాదకరస్థాయిలో వాయు, జల కాలుష్యాన్ని వెదజల్లుతూ తండా వాసులకు, జీవరాసులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న సిప్లాన్ పరిశ్రమను ఇక్కడి నుంచి తొలగించాలని తాటిగడ్డతండా వాసులు సోమవారం గ్రామ కార్యదర్శి రవీందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ.. చాకలిగుట్ట, తాటిగడ్డ తండాలకు అతి సమీపంలో జేపీ దర్గా రోడ్డులో నెలకొన్న సిప్లాన్ డ్రగ్ పరిశ్రమ గత కొన్నేళ్లుగా తీవ్రమైన కాలుష్యాన్ని వెదజల్లుతోందని, దీంతో తాము తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నామని పేర్కొన్నారు. పరిశ్రమ వెదజల్లే కాలుష్యంతో సమీపంలోని భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమవుతున్నాయని, ఆ నీటితో స్నానాలు చేస్తే దురద పుడుతోందని, ఆ నీటిని తాగిన పశువులు మృత్యువాతపడుతున్నాయని ఆరోపించారు. అంతేకాకుండా హరిత హారం కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలు సైతం చనిపోతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆ పరిశ్రమపై చర్యలు తీసుకొని ఇక్కడి నుంచి తొలగించాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బద్రు, దేవేందర్, శ్రీనివాస్, సింగ్, రాజేశ్‌నాయక్, గోవింద్‌నాయక్, తులసీనాయక్, గణేశ్‌నాయక్, పరుశురాం, వినోద్, దినేశ్, పవన్, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకం


మహిళా ఉపాధ్యాయులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్: సమాజాభివృద్ధిలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంఈఓ మనోహర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఎమ్మార్సీ భవనంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువు బోధించి వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో మహిళా ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి వారికి మంచి విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని, నిరక్ష్యరాస్యత నిర్మూలనకు మహిళలు నడుంబించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాధిక, ఉపాధ్యాయులు వెంకటయ్య, సత్యం, సురేశ్, శంకర్, చంద్రశేఖర్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి చేస్తాం

బీఆర్ఎస్ యూత్ కార్యదర్శి జైపాల్


మాజీ మంత్రి హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జైపాల్

షాబాద్: పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని బీఆర్ఎస్ యూత్ కార్యదర్శి జైపాల్ అన్నారు. సోమవారం తన పుట్టినరోజు సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి పుష్పగుచ్చాలు అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ అభివృద్ధి కోసం తపిస్తున్న జైపాల్‌ను హరీశ్‌రావు అభినందించారు. ప్రజలతో మమేకమైతే ఉన్న ఆనందం ఎంతో గొప్పదన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

మాజీ ఎంపీపీ ప్రియాంక


సన్మానం పొందిన మహిళలతో హెచ్‌ఎం తావుర్యానాయక్

నందిగామ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండాలని మాజీ ఎంపీపీ ప్రియాంక అన్నారు. మండల పరిధిలోని చేగూరులో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తావుర్యానాయక్ అధ్యక్షతన సోమవారం మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ ప్రియాంక హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం తావుర్యానాయక్ ఆధ్వర్యంలో పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంతోష, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజిరెడ్డి, మహిళలు అన్నపూర్ణ, భాగ్యమ్మ, గాయత్రి, లక్ష్మి, ప్రసన్న, వాణి, అంగన్‌వాడీ టీచర్లు మంజు, శివలీల, ఆయాలు నీలమ్మ, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

వర్షపునీరు నిలిచే స్థలాల పరిశీలన


రహదారిపై నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై వర్షపునీరు నిలిచే సస్థలాలను అధికారులు గుర్తించారు. సోమవారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఏ.బాలాజీ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్, మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ, చంద్రశేఖర్, ఎన్‌హెచ్ఏఐ అధికారులు జాతీయ రహదారిని పరిశీలించారు. వీఆర్కే మెడికల్ కళాశాల, అజీజ్‌నగర్ మజీద్, అజీజ్‌నగర్ చౌరస్తా, మొయినాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి, కనకమామిడి గేటు వద్ద వర్షం నీరు నిలుస్తున్నట్లు గుర్తించారు. వచ్చే వర్షాకాలం నాటికి ఆయా ప్రాంతాల్లో వర్షం నీరు నిలువకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

షాబాద్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ముద్దెంగూడ ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమ్మరి చెన్నయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని నంకెపల్లిగూడలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించగానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరూ ఐక్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

టెం‘డర్’

- జేపీదర్గా హుండీ టెండర్లకు ఆసక్తి చూపని వ్యాపారులు
- భారీగా పెంచడంతో దూరం

కొత్తూరు: గతంలో జేపీ దర్గా హుండీ టెండర్లను దక్కించుకోవడానికి స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల వ్యాపారులు పెద్దఎత్తున ఆసక్తి చూపేవారు. వక్ఫ్‌బోర్డు అధికారులు టెండర్ల నిర్వహణ కోసం నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే పదుల సంఖ్యలో వ్యాపారులు బిడ్డింగ్‌లో పాల్గొని టెండర్‌ను దక్కించుకునేవారు. కానీ ఈ ఏడాది అధికారులు నోటిఫికేషన్ జారీ చేసినా వ్యాపారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. గతేడాది హుండీ టెండర్లు సుమారు రూ.2కోట్లకు వ్యాపారులు దక్కించుకున్నారు. ఈ ఏడాది వక్ఫ్‌బోర్డు అంచనాలకు మించి హుండీ టెండర్‌ను రూ.4కోట్లకు నిర్ధారించి నోటిఫికేషన్ జారీ చేసింది. అధికారులు ఒక్కసారిగా టెండర్ ధరను పెంచడంతో వేలంలో ఒక్కరూ కూడా పాల్గొనలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వక్ఫ్‌బోర్డు అధికారులు ఈ నెల 7న కొనసాగాల్సిన వేలాన్ని రద్దుచేశారు.

భక్తులకు తప్పని ఇబ్బందులు

ఇప్పటికే దర్గా దర్శనం కోసం వచ్చే భక్తుల పట్ల వ్యాపారులు హుండీలో కానుకలు వేయాలని బలవంతం చేస్తూ దాడులకు పాల్పడుతున్నారు. వ్యాపారుల దౌర్జన్యాలు, దాడులపై పలువురు భక్తులు పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఒక్కసారిగా వక్ఫ్‌బోర్డు అధికారులు రూ.4 కోట్లకు టెండర్లను పెంచడంతో స్థానిక వ్యాపారులతో పాటు భక్తులు వారి తీరును వ్యతిరేకిస్తున్నారు. ఇంతపెద్ద మొత్తంలో టెండర్లు తీసుకుంటే భక్తులకు ఇబ్బందులు తప్పవని పేర్కొంటున్నారు.


జేపీదర్గా

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి గ్రామంలో రూ.15లక్షలతో నిర్మించనున్న అండర్ డ్రైనేజీ, సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ గ్రామానికి చెందిన మురుగునీరు, ఊరి వెలుపల ఉన్న పాడుబడిన బావిలో చేరడంతో దుర్వాసన వస్తుందని, ఈగల, దోమల బాధ తీవ్రంగా ఉందని తెలుపడంతో ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ నీటిని బావిలో పడకుండా ఊరు బయటికి వెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం రూ.10లక్షలతో మురుగు కాల్వ నిర్మించాలని, ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పీఆర్ ఏఈ వంశీకృష్ణకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి రాజు, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ జగదీశ్వర్, ఆర్ఐ శ్రీనివాసు, నాయకులు పాల్గొన్నారు.


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దారితప్పిన శునకం



షాద్‌నగర్ రూరల్: దారి తప్పిన ఓ పెంపుడు కుక్క రోడ్డుపై అటుఇటూ తిరుగుతుండగా గమనించిన స్థానికులు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ ఘటన షాద్‌నగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. కుక్క యజమానులు స్థానిక పీఎస్‌కు వచ్చి తీసుకెళ్లాలని ఎస్ఐ శరత్‌కుమార్ సూచించారు.

పూలే జీవితం అందరికీ ఆదర్శం


చేవెళ్లలో నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ సంఘాల నాయకులు


షాద్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న జేఏసీ నాయకులు

సావిత్రిబాయి పూలే జీవితం మహిళా లోకానికి ఎంతో ఆదర్శనీయమని, ఆమె చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పలువురు పిలుపునిచ్చారు. సోమవారం పూలే వర్ధంతి సందర్భంగా చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఉపాధ్యాయ సంఘాలు, వివిధ పార్టీల నాయకులు ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళలు చదువుకుంటేనే సమాజం బాగుపడుతుందని గుర్తించి మహిళలకు విద్యాబుద్ధులు నేర్పించిన మహనీయురాలు అని కొనియాడారు.


షాబాద్ పాఠశాలలో విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


షాద్‌నగర్‌రూరల్: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు